

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

మేడ్చల్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/వికారాబాద్, సెప్టెంబరు 30: ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో 131 దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఉద్యోగ పదవీ విరమణ పొందిన జిల్లా ఆడిట్ అధికారి వీరభద్రరావును కలెక్టర్ శాలువాలతో సత్కరించారు. అలాగే మేడ్చల్ కలెక్టరేట్‌లోనిర్వహించిన ప్రజావాణిలో 63 అర్జీలను అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌వో స్వీకరించారు.

అట్రాసిటీ కేసుల్లో న్యాయం జరిగేలా చూడాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

మేడ్చల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అట్రాసిటీ కేసులు నమోదు చేసినప్పుడు వాటికి అవసరమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టి న్యాయం జరిగేలా చూడాలని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషనర్ ఛైర్మన్ వెంకటయ్య పోలీసుఅధికారులను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి ముఖ్యఅతిధిగా హాజరైన మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టే పౌరహక్కుల రక్షణచట్టం, అట్రాసిటీ నివారణ చట్టాలను కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు కేసుల వివరాలు, వాటి పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని పెండింగ్‌లో ఉంచరాదని సూచించారు. అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు అయిన వెంటనే విచారణ దశలో ఉన్న బాధితులకు నిబంధనల మేరకు నష్టపరిహారం అందించే విధంగా చ ర్యలు తీసుకోవాలన్నారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్‌కు సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సభ్యులను కోరారు. కేసులు పెట్టిన వారిపై రకరకాల ఒత్తిళ్లు వస్తుంటాయని దీనిని దృష్టిలో పెట్టుకుని పోలీసులు, ఇతర శాఖలు అండగా నిలవాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్‌రెడ్డి, డీసీపీ కోటిరెడ్డి, బాలానగర్‌డీసీపీ సురేష్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌వో హరిప్రియ, రాచకొండ, సైబరాబాద్ పోలీసు అధికారులు, జిల్లా ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటయ్య


కొత్లాపురంలో విరగబూసిన బంతి పూలు



కొడంగల్ ప్రభుత్వ కళాశాలలో బతుకమ్మ వేడుకల్లో విద్యార్థినులు




పూలకు పూజలు

జిల్లాలో పూల పండుగ సందడి మొదలైంది. మహిళలు బతుకమ్మ సంబరాలకు సమాయత్తం అవుతున్నారు. తెలుగు సాహిత్య పరిషత్, ఉమెన్స్ ఎంపవర్మెంట్ ఆధ్వర్యంలో సోమవారం కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబురాలను ఘనంగా న్విహించారు. విద్యార్థినులు తంగేడు, జిల్లేడు, గునుగు, బంతి, ముత్యాలు, తదితర పూలతో బతుకమ్మలను పేర్చారు. అనంతరం కళాశాల ఆవరణలో ఆడిపాడిన అనంతరం నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ రఫియాఖానం, వైస్ ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు. కాగా, మర్పల్లి మండలంలోని కొత్లాపూర్, బూచన్‌పల్లి, పంచలింగాల, పట్లూర్‌తో పాటు వివిధ గ్రామాల్లో ప్రతీ సంవత్సరం రైతులు బంతి పూలు సాగు చేస్తారు. పండుగ సందర్భంగా బంతిపూలు చేతికి రావడంతో రైతులు సంతోషంలో ఉన్నారు. కిలో రూ.60 నుంచి రూ.100 వరకు ధర పలుకుతుందని తెలిపారు.

- కొడంగల్/మర్పల్లి, సెప్టెంబరు 30

రేషన్ సరఫరాలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈకేవైసీ ప్రక్రియ గడువును ప్రభుత్వం మరోసారి పొడిగించింది. సెప్టెంబరు నెలాఖారుతోనే ఈ కార్యక్రమం ముగిసినప్పటికీ చాలామంది ఈకైవేసీ కి దూరంగా ఉన్నారు. దీంతో రేషన్ పంపిణీలో భారీ అక్రమాలు జరుగుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. వాటికి చెక్ పెట్టేందుకు కేవైసీకి మరో చాన్స్ ఇచ్చారు. ఈసారి చేసుకోకపోతే రేషన్ కార్డులో పేరును తొలగించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

- రేషన్ పంపిణీలో భారీగా అక్రమాలు!
- రంగారెడ్డి జిల్లాలో 69శాతం కార్డులకే ఈకేవైసీ
- తుదిగడువును మరోమారు పొడిగించిన ప్రభుత్వం
- ఇదే చివరి అవకాశమని హెచ్చరిక



మూడు జిల్లాల్లో ఇలా

రంగారెడ్డి జిల్లాలో 931 రేషన్‌షాపులు ఉన్నాయి. మొత్తం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని 5.58లక్షల రేషన్‌కార్డుదారులకు ఈ రేషన్ షాపుల ద్వారా బియ్యం సరఫరా చేస్తున్నారు. అయితే ఇందులో 69శాతం కార్డుదారులు మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారు. అలాగే వికారాబాద్ జిల్లాలో 72.9శాతం మంది, మేడ్చల్ జిల్లాలో 80శాతం మంది ఈకేవైసీ ప్రక్రియ పూర్తిచేసుకున్నారు.

ముందుకు రాలే!

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా/వికారాబాద్/ మేడ్చల్ ప్రతినిధి)

రేషన్ కార్డుల ఈకేవైసీకి లబ్ధిదారుల అనాసక్తి

రేషన్ బియ్యం సరఫరాలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కొంత మేర ఫలించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) తప్పనిసరి చేయడంతో కొందరి బండారం బయట పడుతోంది. రేషన్‌కార్డులో పేరున్న ప్రతీ కుటుంబ సభ్యునికి ఈకేవైసీ తప్పనిసరి చేసింది. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ఈకేవైసీ చేయించుకోకపోతే వారి పేరును కార్డులో నుంచి తొలగించి మిగతా వారికి రేషన్ ఇస్తారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన గడువు పూర్తయినప్పటికీ ఉమ్మడి జిల్లాలో దాదాపు 25 శాతానికిపైగా రేషన్‌కార్డుదారులు ఇంకా ఈకేవైసీ చేయించుకోలేదు. గడువు ముగిసినా కూడా భారీ సంఖ్యలో కొందరు కేవైసీ చేయించుకోకపోవడం చూస్తే రేషన్ పంపిణీలో భారీగా అక్రమాలు జరుగుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. అయితే భారీ సంఖ్యలో కేవైసీ చేసుకోని వారు ఉండడంతో ప్రభుత్వం మరో మారు ఈ ప్రక్రియ గడువు పొడిగించింది. ఇదే చివరి చాన్స్ అంటూ హెచ్చరించింది. ఇదిలా ఉంటే పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం భారీగా పక్కదారి పడుతున్నట్లు కొన్నేళ్లుగా ఆరోపణలు వస్తున్న విషయం తెలిసిందే. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన సంఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. అధికారులు చేస్తున్న నామమాత్రపు తనిఖీల్లో కూడా క్వింటాళ్ల కొద్దీ రేషన్ బియ్యం పట్టుబడుతున్నాయి. దీంతో రేషన్ సరఫరాలో అక్రమాలతో పాటు అక్రమ రవాణాను అరికట్టి అర్హులకే బియ్యం అందేలా చూసేందుకు గత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఎన్నికలు రావడంతో అప్పటి ప్రభుత్వం దీన్ని పెద్దగా పట్టించుకోలేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈకేవైసీ ప్రక్రియను పూర్తిచేసేందుకు సెప్టెంబర్ నెలాఖరునాటికి గడువు విధించింది. కానీ లక్షల సంఖ్యలో కార్డుదారులు ఇంకా ఈకేవైసీ చేయించుకోలేదు. ఇందులో కొందరు నిర్లక్ష్యంతో ఈ ప్రక్రియకు దూరంగా ఉన్నప్పటికీ ఎక్కువ మంది ఇతర కారణాలతో ఈకేవైసీ చేయలేదు. కొందరికీ ఆధార్ నవీకరణ, బయోమెట్రిక్ వంటి సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. అలాగే పదేళ్లలో అనేక మంది చనిపోయారు. వివాహాలు చేసుకొని కొందరు యువతులు అత్తారింటికి వెళ్లిపోయారు. మరికొందరు కొత్తగా కాపురాలు పెట్టారు. వీరికి రేషన్‌కార్డులు మంజూరు కాలేదు. ఇలాంటి వారి పేర్లు తల్లిదండ్రులతో పాటు రేషన్‌కార్డుల్లో కొనసాగుతున్నాయి. అయితే ఆధార్ అనుసంధాన సమయంలో చిరునామాలు తేడా రావడంతో ఈ ప్రక్రియలో సమస్యలు ఎదురవుతున్నాయి. ఇక చనిపోయిన వారు, నకిలీ పేర్లు కూడా భారీగానే ఉన్నట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో పలు సమస్యలు ఉన్నప్పటికీ కొత్తకార్డులు లేకున్నా గతంలో కొందరికి ఇచ్చిన ఆహార భద్రతకార్డులు ఆధారంగా రేషన్ బియ్యం పంపిణీ సాగుతోంది. ఇదిలా ఉంటే లబ్ధిదారుల పేరుతో కొందరు రేషన్ డీలర్లు రేషన్ నిల్వలను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈకేవైసీతో ఇప్పుడు వీటన్నింటికీ చెక్‌పడనుంది.

డిసెంబరు 31 వరకు పొడిగింపు

సెప్టెంబరు నెలాఖరుతో ఈకేవైసీకి గడువు ముగిసినా.. ఇంకా పెద్దసంఖ్యలో కార్డుదారులు ఈ ప్రక్రియ చేయించుకోకపోవడంతో ప్రభుత్వం డిసెంబరు 31వరకు గడువు పొడిగించింది. అయితే మరోమారు పొడిగింపు ఉండదని, ఇదే చివరి చాన్స్ అని పేర్కొంది. ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉండే కార్డుదారులు భవిష్యత్తులో రేషన్ పొందలేరని స్పష్టం చేసింది. అలాగే ప్రభుత్వపథకాలు పొందే విషయంలో తీవ్రఇబ్బంది పడాల్సి ఉంటుందని హెచ్చరించింది.

డీఎస్సీ ఫలితాల్లో సత్తా

- ఉత్తమ ర్యాంకులు సాధించిన జిల్లా అభ్యర్థులు
- నేటి నుంచి 5వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన


ఎండీ.జిలానీ (హిందీ పండిట్) ఫస్ట్ ర్యాంకు


రవికుమార్ (హిందీ పండిట్) సెకండ్ ర్యాంకు


వరుణ్‌తేజ్, (తెలుగు పండిట్) ఫస్ట్ ర్యాంకు


వెంకటయ్య, (తెలుగు పండిట్) సెకండ్ ర్యాంకు

వికారాబాద్(ఆంధ్రజ్యోతిప్రతినిధి)/దోమ/పూడూరు/బొంరాస్‌పేట్, సెప్టెంబరు 30 : రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో జిల్లా అభ్యర్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. దోమ మండలంలోని అయినాపూర్ గ్రామానికి చెందిన ఎండీ.జిలానీ (హిందీ పండిట్ జిల్లా మొదటి ర్యాంకు సాధించాడు. అదే విధంగా మోత్కూర్ గ్రామానికి చెందిన బుద్ధారం రవికుమార్ ద్వితీయ ర్యాంకు సాధించాడు. రవికుమార్, జిలానీ ఇద్దరు బాల్య స్నేహితులు కావడం, ఇద్దరికీ ఒకేసారి ఉద్యోగాలు రావడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. రవికమార్ ఇటీవలే విడుదల చేసిన పీజీటీ ఫలితాల్లో ఉపాధ్యాయుడిగా ఎంపికై పరిగి మండలంలోని మహాత్మా జ్యోతిరావు పూలేలో హిందీ పండిత్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయినాపూర్ గ్రామానికి చెందిన జిలానీకి ఒకేసారి రెండు ఉద్యోగాలు రావడంతో సంతోషం వ్యక్తం చేశాడు. అలాగేపూడూరు మండలంలోని పెద్ద ఉమెంతాల్ గ్రామానికి చెందిన జె.మల్లయ్య జిల్లాస్థాయిలో 6వ ర్యాంకు సాధించాడు. బొంరాస్‌పేట్ మండలం నాందర్‌పూర్ గ్రామంలో నలుగురు అభ్యర్థులు ఎంపికయ్యారు. అందులో ఒకే కుటుంబం నుంచి ఇద్దరు అన్నదమ్ములు కుంబాల రాఘవేందర్ జిల్లా స్థాయిలో 16వ ర్యాంకు సాధించగా, ఆయన సోదరుడు కుంబాల నరేశ్ 32వ ర్యాంకు సాధించారు. అదే గ్రామానికి చెందిన తట్టి పెద్ద వెంకటయ్య తెలుగు ఉపాధ్యాయుడిగా జిల్లా స్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించాడు. అదే గ్రామానికి చెందిన యం.వేణుగోపాల్ 59వ ర్యాంకు సాధించాడు. ఎస్జీటీ తెలుగు మీడియం కేటగిరీలో పరిగి పట్టణానికి చెందిన సుల్తాన్‌పూర్ జీహెచ్ఎం వలబోజు రమాపతి కుమారుడు వరుణ్‌తేజ్ జిల్లాలో మొదటి స్థానంలో నిలిచి సత్తా చాటారు.

నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

డీఎస్సీలో ఉత్తమ మార్కులు సాధించిన అభ్యర్థుల్లో 1:3 జాబితా ప్రకారం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనున్నట్లు జిల్లా విద్యాధికారి జి.రేణుకాదేవి తెలిపారు. ఈనెల ఒకటో తేదీ, మంగళవారం నుంచి 5వ తేదీ వరకు అభ్యర్థుల సర్టిఫికేట్ల పరిశీలన కొనసాగనున్నట్లు చెప్పారు. దీనికోసం జిల్లా కేంద్రంలో అన్ని మాధ్యమాల ఎస్జీటీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రభుత్వ డైట్ కళాశాలలో జరగనుండగా, శివారెడ్డిపేట జడ్పీ పాఠశాలలో అన్నిసబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్, భాషా పండితులు, పీఈటీ అభ్యర్థులకు పరిశీలించనున్నారు.



మాట్లాడుతున్న ఐజీ సత్యనారాయణ

అక్రమాలకు పాల్పడితే ఉక్కుపాదం

- మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ

వికారాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : అక్రమాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని మల్టీ జోన్ -2 ఐజీ వి.సత్యనారాయణ పోలీసుఅధికారులను ఆదేశించారు. సోమవారం వికారాబాద్ పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నమోదైన కేసులు, పెండింగ్ ఫైళ్ల గురించి ఆరా తీశారు. అనంతరం జిల్లా పోలీసుకేంద్ర కార్యాలయం కాన ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డిలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేసినా, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వదిలి పెట్టకూడదన్నారు. అవసరమైతే సస్పెక్ట్ షీట్లు తెరవాలని ఆదేశించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు మెచ్చే విధంగా, నచ్చే విధంగా పనిచేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు.జిల్లాలో ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీటీవీలను ఏర్పాటు చేసుకుని నిఘా పెంచాలన్నారు. స్టేషన్‌కు వచ్చే మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలకు సంబంధించిన కేసుల పట్ల పోలీసు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పనిచేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలను నిరోధించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే పోలీసు అధికారుల పైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.మర్పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న పేకాటకేసుల్లో నేరస్థులైన రఫీయొద్దీన్, ప్రభాకర్‌గుప్తాలకు కౌన్సిలింగ్ చేసి ఇద్దరిపై సస్పెక్ట్ షీట్ నమోదు చేశారు. కార్యక్రమంలో ఎస్పీ కె.నారాయణరెడ్డి, అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.

159 సార్లు రక్తదానం

తాండూరు : తాండూరు బాలాజీ ఆస్పత్రి ఎండీ. డాక్టర్ సంపత్‌కుమార్ ఇప్పటి వరకు 159 సార్లు రక్తదానం చేశారు. ఆపద ఉందని ఫోన్ వస్తే చాలు ఉన్నపలంగా రోగి ఉన్న చోటుకు వెళ్లి మరీ రక్తదానం చేసిన సందర్భాలు అనేకం. దేశంలోనే ఒక వ్యక్తి 148 సార్లు రక్తదానం చేసిన వారుండగా ప్రస్తుతం ఆ రికార్డును సంపత్‌కుమార్ బద్దలుకొట్టి 159 సార్లు రక్తదానం చేశారు. అయితే ఆయన మాత్రం రక్తదానంపై ప్రచారం చేసుకోవడానికి గానీ, తన పేరును గిన్నిస్ బుక్ రికార్డ్స్‌లో నమోదు చేసుకోవడానికి ఆసక్తి చూపడం లేదు.


రక్తదానం చేస్తున్న డాక్టర్ సంపత్‌కుమార్



రక్తదాతలు.. స్ఫూర్తిప్రదాతలు

స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్న ప్రాణదాతలు

చేవెళ్ల, సెప్టెంబరు 30 : అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో ప్రభుత్వాలు, పలు స్వచ్ఛంద సంస్థలు రక్తదానంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయినా రక్తం అందక పులువురు ప్రాణాలు కోల్పోతున్నారు. కొన్ని సమయాల్లో బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వలు అందుబాటులో లేక దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో అనేక మంది స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ వేల మంది ప్రాణాలను కాపాడుతున్నారు. పలువురు స్వచ్ఛంద సంస్థలు శిబిరాలు ఏర్పాటు చేసి రక్తాన్ని సేకరిస్తున్నారు. నేడు 'జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనాలు..

- ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుతో రక్తం సేకరణ
- వందల సార్లు రక్తదానం చేస్తున్న మహానుభావులు

యువతకు స్ఫూర్తి.. యువ 24 ఫౌండేషన్

కొడంగల్ రూరల్ : ప్రభుత్వ ఆసుపత్రులలో డెలివరీ కోసం వచ్చే మహిళలకు అవసరమయ్యే రక్తం అందుబాటులో లేదనే విషయాన్ని తెలుసుకుని కొంత మంది యువకులు వారికి రక్తదానం చేశారు. ఈ క్రమంలో ఆ స్నేహితులు 'యువ 24 ఫౌండేషన్'ను ఏర్పాటు చేసి రక్తదాన శిబిరాల ద్వారా రక్తాన్ని సేకరించి అవసరమైన వారికి అందిస్తున్నారు. కొడంగల్ మండల పరిధిలోని రావులపల్లి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల యువకులు సురేశ్ గౌడ్, నరేశ్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, అశోక్, కృష్ణ యాదవ్, రవిగౌడ్, మాటూర్ వెంకట్, రామయ్యగౌడ్, కలారి రమేష్, మహేష్‌గౌడ్, మహమూద్‌లు కలిసి 2021లో యువ 24 ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శిబిరంలో 52 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

ప్రాణాలు కాపాడటమే లక్ష్యం

శంషాబాద్: రక్తదానం చేసి మనిషి ప్రాణాలు కాపాడటమే

మిగతా 7వ పేజీలో...

రక్తదానానికి ముందుకు రావాలి

షాబాద్ : హోప్ ఫౌండేషన్ రక్తదాన శిబిరాలు నిర్వహించి ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటుంది. ఇప్పటి వరకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 9 శిబిరాలు నిర్వహించి ఎంతో మంది ప్రాణాపాయంలో ఉన్న వారికి అవసరమైన రక్తాన్ని అందించారు. ఫౌండేషన్ ద్వారా కొండ విజయ్‌కుమార్ 10సార్లు రక్తదానం చేశారు.

రక్తదానంతో మరింత సంతృప్తి

ఇప్పటి వరకు తాను 25సార్లు రక్తదానం చేసినట్లు చేవెళ్లకు చెందిన బండారు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన ప్రతీ మూడు మాసాలకోసారి రక్తదానం చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తం ఇస్తుంటానని పేర్కొన్నారు. ఇక్కరెడ్డిగూడకు చెందిన రక్తదాత గణపతి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తాను 25 సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితిలో రక్తదానం చేయడం ద్వారా ఇతరుల ప్రాణాలను నిలబెట్టిన వారమవుతామని చెప్పారు.


రక్తదానం చేస్తున్న బండారి చంద్రశేఖర్‌రెడ్డి

తిరుగులేని శక్తిగా బీజేపీ

కడ్తాల్, సెప్టెంబరు 30: దేశంలో బీజేపీ తిరుగులేని శక్తిగా మారిందని నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ బీజేపీ కో-ఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి, కల్వకుర్తి నియోజకవర్గ కో-కన్వీనర్ నర్సింహులు అన్నారు. బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేద్దామని పిలుపు నిచ్చారు. కడ్తాలలో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వారితో పాటు రాఘవేందర్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై సభ్యత్వాలను ప్రారంభించారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలు, సమస్యలపై పార్టీ శ్రేణులు పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో భగీరథ్, డి.మహేశ్, శ్రీశైలం పాల్గొన్నారు.

విదేశాలకు వాహనాల అక్రమ రవాణా

- పాతవాటిని కొత్తగా రంగులేసి విక్రయాలు
- వికారాబాద్ జిల్లా పరిగి మీదుగా కర్ణాటక, మహారాష్ట్రకు
- పరిగి పోలీసుల తనిఖీలతో వెలుగులోకి..

పరిగి, సెప్టెంబరు 30: వాహనాల అక్రమ రవాణా గుట్టు రట్టయింది. ఇలా రవాణా చేస్తున్న వానాహనాలను విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా పరిగి పోలీసులు నమ్మదగిన సమాచారం మేరకు పరిగిలోని కొడంగల్ చౌరస్తాలో తనిఖీలు నిర్వహిస్తుండగా నంబర్ ప్లేట్ లేని ఓ బోరు డ్రిల్లింగ్ వాహనాన్ని తనిఖీ చేశారు. ఆ తనిఖీల్లో ఆ వాహనానికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేనందుకు వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, విచాణంలో ఆసక్తికరమైన విషయాలు తెలుగులోకి వచ్చాయి. కాలం చెల్లిన వాహనాలను కొత్త వాహనాలుగా తయారు చేస్తున్నట్లు తెలిసింది. ఇలా పాత బోరు డ్రిల్లింగ్ వాహనాలకు కొత్తగా రూపురేఖలు మార్చి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్‌లోని వనస్థలిపురం ప్రాంతంలో పాత బోరుబండ్లకు కొత్త పరికరాలతో అసెంబ్లీ ఫిట్టింగ్‌తో తయారు చేస్తున్నట్లు తెలిసింది. ఇలా కొత్త వాహనాలుగా ముస్తాబు చేసి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. వనస్థలిపురం నుంచి రోడ్డు మార్గాన 163 జాతీయ రహదారి గుండా పరిగి మీదుగా కర్ణాటకలోని షోలాపూర్, ముంబై పోర్టుకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి షిప్ యార్డు ద్వారా జాంబియా దేశానికి ఎగుమతి చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తెలిసింది. ఈ రోడ్డుపై ఇది కొత్తదేమీ కాదని, ఈ తరహాలో కొన్నేళ్ల నుంచి తతంగం నడుస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ రవాణా అధికార, ప్రతిపక్ష నాయకుల సహకారంతోనే జరుగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బోరు డ్రిల్లింగ్ వాహనాల అక్రమ తరలింపుతో ప్రభుత్వ ఆదాయానికి కూడా భారీగా గండి పడుతున్నది. ఈ నెల రోజుల వ్యవధిలోనే 40కిపై వాహనాలు అక్రమంగా తరలించినట్లు సమాచారం. ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళుతున్న వాహనాన్ని రవాణా శాఖ అధికారులు అప్పగించినట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.



పట్టు బడిన బోరుబండి

మద్యం అమ్మితే రూ.50 వేల జరిమానా



గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

షాద్‌నగర్‌రూరల్, సెప్టెంబరు 30: రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం కిషన్ నగర్‌లో మద్యం అమ్మితే రూ. 50 వేలు జరిమానా విధించనున్నట్లు గ్రామస్థులు హెచ్చరికలు జారీ చేశారు. మద్యం విక్రయించినా.. కొనుగోలు చేసినా విధించే జరిమానా వివరాలు ఫ్లెక్సీలో పొందుపరిచి గ్రామంలో ఏర్పాటు చేశారు. గ్రామంలో 30 బెల్ట్ షాపులు ఉన్నాయని తెలిపారు. మద్యం అమ్మిన వ్యక్తికి రూ. 50 వేల జరిమానాతో పాటు చెప్పుల దండ మెడలో వేయడం జరుగుతుందని అన్నారు. మద్యం కొన్నవారికి రూ.25 వేలు జరిమానా విధిస్తామన్నారు. మద్యం అమ్ముతున్నట్లు సమాచారం ఇస్తే రూ.10వేలు బహుమతిగా ఇస్తామని తెలిపారు.

వృద్ధులను అందరూ గౌరవించాలి


రావిరాలలో వృద్ధులను సన్మానిస్తున్న సీడీపీవో శాంతిశ్రీ

మహేశ్వరం, సెప్టెంబరు 30: వయోవృద్ధులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని మహేశ్వరం ఐసీడీఎస్ సీడీపీవో శాంతిశ్రీ అన్నారు. సోమవారం తుక్కుగూడ మున్సిపాలిటీ రావిరాలలో జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. పలు వృద్ధ జంటలను సన్మానించారు. అనంతరం ఇమె మాట్లాడుతూ వృద్ధులను ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఈ రోజుల్లో చాలా మంది తల్లిదండ్రులను అనాథలుగా వదిలేస్తున్నారని, అలా చేయడం తప్పు అన్నారు. వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తూ కంటికి రెప్పలా చూసుకోవాలన్నారు. వృద్ధులకు ఎలాంటి సమస్యలున్నా 14567 అనే టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ టీచర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలి


సివిల్ సప్లయీస్ జాయింట్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న రేషన్ డీలర్లు

మహేశ్వరం, సెప్టెంబరు 30: కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులిమామిడి లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. సోమవారం రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో నగరంలోని సోమాజిగూడలో గల సివిల్ సప్లయీస్ కమిషనరేట్‌లో జాయింట్ కమిషనర్ రాథోడ్‌కు వినతిపత్రం ఇచ్చారు. డీలర్లందరికీ రెండు నెలలుగా రేషన్ కమిషన్ రాలేదన్నారు. డీలర్లకు గౌరవవేతనం, హెల్త్‌కార్డులివ్వాలని కోరామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో రేషన్ డీలర్లకు ఇచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం నెరవేర్చాలని వినతపత్రంలో కోరామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ మండలాల రేషన్ డీలర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న గ్రంథాలయ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 30: స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని చౌదర్‌పల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్యాగులు, మ్యాట్‌లు, చెప్పులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పేదవిద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూతనందిస్తూ వారికి ఉచితంగా బ్యాగులు, మ్యాట్లు, చెప్పులు అందించడం సంతోషదాయకమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ జిల్లా కో ఆర్డినేటర్లు ప్రకాశ్‌కుమార్, మాజీ మండల వైస్‌ఎంపీపీ శేరి నారాయణరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి పాఠశాల హెచ్‌ఎం పరమేశ్వరి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు నర్సింహులు, వెంకటయ్య పాల్గొన్నారు.

డీసీసీబీని రూ.2వేల కోట్ల టర్నోవర్‌కు తెచ్చా

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, సెప్టెంబరు 30: తాను రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న సమయంలో రూ.600కోట్ల టర్నోవర్‌లో ఉన్న బ్యాంకును మూడేళ్లలో రూ.2వేల కోట్ల టర్నోవర్‌కు తీసుకొచ్చానని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. తాండూరు పట్టణంలోని సల్లా గార్డెన్‌లో సోమవారం ఎల్మకన్నె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తక్కువ సమయంలోనే సొసైటీలు, బ్యాంకులు విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చినట్లు తెలిపారు. సొసైటీలో అన్ని సేవలను కంప్యూటరైజ్ చేసి రైతులకు నమ్మకం కలిగించినట్లు తెలిపారు. ప్రతీ రైతు సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అన్ని సొసైటీల్లో గోదాంలు మంజూరు చేసినట్లు తెలిపారు. దేశంలో ఏ ప్రభుత్వం చేయలేని సాహసాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేసి అతి తక్కువ సమయంలోనే మూడు విడతల్లో అర్హులైన ప్రతీ రైతుకు రూ.లక్ష లోపు రూ.32వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశారని అన్నారు. కొంత మందికి సాంకేతిక కారణాలతో కొన్ని డాక్యుమెంట్స్‌లో వివరాలు, బ్యాంకు ఖాతాకు పోల్చితే లోపాలు వస్తుండటంతో రుణమాఫీ కాలేదని వెల్లడించారు. సమావేశంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, డైరెక్టర్ లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నర్సిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగప్ప, మాజీ వైస్ ఎంపీపీ స్వరూప, సొసైటీ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, సీఈవో శ్రీనివాస్, అడిషనల్ సీఈవో చంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

రెండేళ్లలో నేనేంటో చూపిస్తా

తాండూరు: తాండూరు సహకార సొసైటీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'నేనేంటో.. తాండూరుకు ఏం చేస్తానో రెండేళ్లలో చూపిస్తా.. ఉత్త మాటలు కాదు.. చేతల్లో చూపిస్తా' అని అన్నారు. అదే విధంగా తాండూరును 25 ఏళ్లుగా పాలించినవారు ఏం చేశారని ప్రశ్నించారు. ఉత్తుత్తి ప్రొసీడింగ్‌లు ఇచ్చి అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు.కోట్‌పల్లి ఇరిగేషన్ ప్రాజెక్టు ఆధునీకరిస్తానని చెప్పారు. తనపై ఎవరెన్ని విమర్శలు చేసిన తన దృష్టి అభివృద్ధి పైనే ఉంటుందని స్పష్టం చేశారు.

రక్తదాతలు.. స్ఫూర్తిప్రదాతలు

(5వ పేజీ తరువాయి)

తమ ఫౌండేషన్ లక్ష్యమని మార్వాడీ యువమంచ్- జిందగి ఫౌండర్ ప్రేం గచవా తెలిపారు. పది సంవత్సరాల క్రితం పది మంది స్నేహితులతో కలసి మార్వాడీ యువమంచ్- జిందగి ఫౌండేషన్ ప్రారంభించామన్నారు. ఏడాదిలో జంటనగరాలతో పాటు రంగారెడ్డి జిల్లాలో 22 రక్తదాన శిబిరాలు నిర్వహించి 2000యూనిట్ల రక్తాన్ని సేకరించి తలసేమియా బాధితుకు అందజేశామన్నారు. తమ సంస్థ నుంచి ప్రతీ నెల 700 మందికి పైగా తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తం అందిస్తున్నట్లు తెలిపారు.

'వీ ఫర్ యూ' ద్వారా 19 శిబిరాలు

పెద్దేముల్: పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామానికి చెందిన సిద్దార్థరెడ్డి ఇప్పటి వరకు 10సార్లు రక్తం దానం చేశాడు. అందరూ రక్తం దానం చేయాలని కోరుతూ తాను నెలకొల్పిన 'వీ ఫర్ యూ' ఫౌండేషన్ ద్వారా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాడు. ఒకరిని ఇవ్వమని కోరడమే కాకుండా తాను కూడా రక్తదానం చేస్తున్నారు. ఇప్పటి వరకు అతడు 19 సార్లు తన ఫౌండేషన్ ద్వారా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి తాను కూడా 10 సార్లు రక్తం దానం చేశారు. రక్తదానం చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నట్లు సిద్ధార్థరెడ్డి తెలిపారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకున్నాననే సంతోషం కలుగుతోందని 13 సార్లు రక్తదానం చేసిన మంబాపూర్‌కు చెందిన మారుతీ చారి తెలిపారు. రక్తదానం మహాదానం అనే విషయాన్ని తాను నమ్ముతున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

2 లక్షల యూనిట్లు సేకరించాం: రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయిచౌదరి

నేను డిగ్రీ చదువుకునే రోజుల్లో రోడ్డు ప్రమాదంలో నా స్నేహితుడు రక్తం దొరకక చనిపోయాడు. 1990 నుంచి నేను రక్తదానం చేయాలని సంకల్పంతో రక్తదానం చేస్తూ ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలలో ఐటీ సెక్టార్‌లలో రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఇప్పటి వరకు సుమారు రెండు లక్షల యూనిట్ల రక్తాన్ని సేకరించి ప్రభుత్వ రక్తనిధి కేంద్రాలకు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రాల ద్వారా ప్రజలకు అందిస్తున్నాం. త్వరలో 'నా రక్తం నా గ్రామం' అనే నినాదంతో వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఒక గ్రామంలో పైలట్ ప్రాజెక్టు చేపడుతున్నామన్నారు.


అప్పటి గవర్నర్ నుంచి మెడల్ అందుకుంటున్న సాయిచౌదరి

107 సార్లు రక్తదానం చేశా



షాబాద్ : ప్రతి ఇంట్లో ఒక రక్తదాతను తయారు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాను. నా వంతు ప్రయత్నంగా 107 సార్లు రక్తదానం చేశాను. 27 సార్లు రక్త కణాలను సైతం దానం చేశాను. ఈ సేవను గుర్తించి 2018లో గవర్నర్ నరసింహన్ అవార్డు కూడా ఇచ్చారు.

- అర్థ మహేందర్‌రెడ్డి, రేగడిదోస్వాడ

వెంకటయ్య 85 సార్లు..



తాండూరు ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ వెంకట సుబ్బయ్య ఇప్పటి వరకు 85 సార్లు రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితిలలో రోగులకు అవసరమైన సమయంలో రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలిచారు. 45 ఏళ్లుగా ఏడాదికి 2 నుంచి 3 సార్లు రక్తదానం చేస్తున్నారు. 1979 నుంచి రక్తదానాన్ని చేస్తున్నట్లు ఆయన వివరించారు.

సూర్యనారాయణరావు 119 సార్లు..



ఘట్‌కేసర్ : ఘట్‌కేసర్‌లోని ఎన్ఎఫ్‌సీ నగర్‌కు చెందిన సిస్టా సూర్యనారాయణరావు అలియాస్ బొట్టు సూరి. 62 సంవత్సరాల ఆయన ఇప్పటివరకు 119 సార్లు రక్తదానం చేసి పలువురి అభినందనలు అందుకున్నారు. అపోహలు వీడి అందరూ రక్తదానం చేయాలని ఆయన కోరారు.

కార్యకర్తలకు కాంగ్రెస్ అండ


కేఎల్లార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న గడ్డిఅన్నారం ఏఎంసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

మహేశ్వరం, సెప్టెంబరు 30: పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతీ కార్యకర్తను కాంగ్రెస్ కంటికి రెప్పలా కాపాడుకుంటూ తగిన గుర్తింపు ఇస్తుందని మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడారు. కార్యకర్తలెవరూ నిరుత్సాహపడొద్దని, సమయమొచ్చినప్పుడు పదవులు వాటంతట అవే వస్తాయన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతీ కార్యకర్తకు న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఆదేశించారని తెలిపారు. గతంలో ఇబ్బందులెదుర్కొన్న వారు ఎంతో మంది ఉన్నారని, వారందరికీ తగిన సమయాల్లో నామినేటెడ్, పార్టీ పదవులు వస్తాయన్నారు. ఈ విధంగానే గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చిలుక మధుసూదన్‌రెడ్డిని నియమించామన్నారు. నేతలు కేఎల్లార్, దేప భాస్కర్‌రెడ్డిలకు ఏఎంసీ తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నామని ఏఎంసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాల్లో అన్యమత ఉద్యోగులను తొలగించాలి

కల్తీ లడ్డూ వ్యవహారంలో దోషులను కఠినంగా శిక్షించాలి : శంకర్‌స్వామి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వికారాబాద్, సెప్టెంబరు 30: ఆలయాల్లో పనిచేస్తున్న అన్యమస్తులను ఉద్యోగాల నుంచి తొలగించాలని సాధు సమితి అధ్యక్షుడు శంకర్ స్వామి అన్నారు. తిరుమల లడ్డూల కల్తీపై నిరసనగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రామ మందిరం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి అనంతరం ఎన్టీఆర్ చౌరస్తాలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుమల లడ్డూలను కల్తీ చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని ఆలయాల్లోనూ ప్రసాదాలను పరీక్షించాలని, దేవాలయ పాలన విభాగాల్లో ఆధ్యాత్మికవేత్తలకు చోటు కల్పించాలన్నారు. దేవాదాయ శాఖను వెంటనే రద్దు చేయాలని, ఆలయాలపై పెత్తనాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి, బసిరెడ్డిపల్లి కృష్ణస్వామి, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్, కార్యదర్శి శ్రీలతారెడ్డి, సహకార దర్శి ప్రభాకర్‌గౌడ్, దోమ శ్రీకాంత్, హిందూసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పరిగిలో నిరసన ర్యాలీ

పరిగి: తిరుమల లడ్డూ ప్రసాద కల్తీని నిరసిస్తూ పరిగి హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పరిగిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. పరిగిలోని కొడంగల్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఆనంద్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సోమరాము మాట్లాడుతూ.. ఆలయాల్లో ప్రసాదాల నాణ్యతపై కమిటీ వేసి నిరంతర పర్యవేక్షణ ఉండాలని డిమాండ్ చేశారు. ప్రసాదాల కల్తీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.హన్మంత్‌ముదిరాజ్, ఎం.నాగేశ్వర్, ఇ.కృష్ణ, పెంటయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డికి ఎస్కార్ట్ కేటాయింపు

ఎమ్మెల్సీ ఇంటికి చేరిన ఎస్కార్ట్, పైలెట్ వాహనాలు

ఈనెల 4న శాసనమండలి విప్‌గా బాధ్యతలు!



తాండూరు, సెప్టెంబరు 30: పార్లమెంటు ఎన్నికలకు ముందుగానే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి శాసనమండలి చీఫ్ విప్‌గా బాధ్యతలు కేటాయిస్తు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. అప్పటి నుంచి మహేందర్‌రెడ్డి విప్‌గా బాధ్యతలు చేపట్టలేదు. అయితే బుధవారం పితృపక్షం అమావాస్య ముగియనునడంతో ఈనెల 4న (శుక్రవారం) విప్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి, శాసన మండలి స్పీకర్‌కు సమాచారం ఇవ్వడంతో మహేందర్‌రెడ్డికి పైలెట్, ఎస్కార్ట్ వాహనాలను కేటాయించారు. వీటితో పాటు 8 మంది ఎస్కార్ట్ సిబ్బందిని కూడా కేటాయించారు. కేటాయించిన వాహనాలు పాతవిగా ఉండటంతో వాటి స్థానంలో కొత్త వాటిని కేటాయించాలని ఎమ్మెల్సీ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి లేఖను కూడా పంపారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత మహేందర్‌రెడ్డిని ప్రోటోకాల్ పరిధిలోకి తీసుకు వచ్చి రంగారెడ్డి లేదా వికారాబాద్ జిల్లా బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. ఇటీవల తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం రోజు మహేందర్‌రెడ్డికి మేడ్చల్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి అక్కడ ప్రభుత్వ పరంగా జాతీయ జెండాను ఎగురవేసే అవకాశం కల్పించింది.

గర్భిణులను ఇబ్బంది కలిగించొద్దు


మాట్లాడుతున్న పల్వన్‌కుమార్

వికారాబాద్, సెప్టెంబరు 30: సేవా లోపంతోగానీ, అజాగ్రత్తతో గానీ గర్భిణులకు ఇబ్బందులు కలిగించొద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పల్వన్ కుమార్ తెలిపారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు చోటుచేసుకున్న ఐదు మాతృ మరణాలపై సీహెచ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పవిత్ర, డిప్యూటీ డీఎంహెచ్‌వో సంబంధిత వైద్యాధికారులు, సిబ్బంది ఆశా కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మాతృ మరణాలు, అందుకు గల కారణాలపై కేసు వారిగా సంబంధిత వైద్యాధికారులను సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ. ప్రమాదకర లక్షణాలున్న గర్భిణులను ప్రాథమిక దశలోనే గుర్తించి తగు చికిత్సలు అందించడం వల్ల సాధారణ ప్రసవమూ ఉన్నత శ్రేణి ఆస్పత్రిలో జరిగే విధంగా జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రతీ ఒక్క గర్భిణి, బాలింత పుట్టిన ప్రతీ బిడ్డ ఆరోగ్యానికి భరోసానిచ్చేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీంద్ర యాదవ్, శ్రీనివాస్, డెమో పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మహారాష్ట్ర ఎన్నికలకు రామ్మోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి, సెప్టెంబరు 30: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి ఒక పార్లమెంటు నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆ రాష్ట్రంలోని హింగోలి లోక్‌సభ నియోజకవర్గానికి రామ్మోహన్‌రెడ్డిని ఏఐసీసీ ఇన్‌చార్జిగా నియమించింది. ఈ మేరకు రామ్మోహన్‌రెడ్డి సోమవారం హింగోలి జిల్లా కేంద్రంలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించడంపై సీనియర్ నాయకులతో చర్చించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు ప్రజ్ఞధ్యాయి, డీసీసీ అధ్యక్షుడు దిలీప్‌రాయిదేశాయి, కో-ఆబ్జర్వర్ తాతుజీ దేశ్ముక్‌లు ఉన్నారు.

శునకాలకు జనన నియంత్రణ శస్త్ర చికిత్సలు


శునకాలకు శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్న పశువైద్యులు

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 30: కొడంగల్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో కుక్కల బెడద నివారణ చర్యలు కొనసాగుతున్నాయి. కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని పాతకొడంగల్, పాత కొడంగల్ తండా, కొండారెడ్డిపల్లి, ఐనోన్‌పల్లి, బుల్కాపూర్, గుండ్లకుంట, కొడంగల్‌లో మున్సిపల్ సిబ్బంది గుర్తించిన 224 శునకాలు, 26గ్రామ పంచాయితీల పరిధిలో పశువైద్య సిబ్బంది 930 శునకాలను గుర్తించారు. రాజమండ్రి నుంచి రప్పించిన బృందం సభ్యులతో శునకాలను పట్టించి ప్రత్యేకంగా మున్సిపల్ వాహనానికి జాలి ఏర్పాటు చేశారు. అందులో శునకాలను జనన నియంత్రణ కేంద్రానికి తరలించి పశువైద్యులు శస్త్రచికిత్సలు చేశారు. అనంతరం శునకాలకు ప్రత్యేకంగా ప్రత్యేక వాహనంలో ఐదు రోజుల పాటు ఆహారాన్ని అందించి ఏ ప్రాంతం నుంచి పట్టుకుని వచ్చారో అక్కడే వదిలి వేస్తారని వైద్యులు తెలిపారు. శునకాలు సంఖ్య పెరిగిపోయి ప్రజలపై దాడులు చేస్తున్నాయని, ఇలాంటి ఘటనల నివారణకు శునకాల్లో సంతానోత్పత్తి జరగకుండా శస్త్ర చికిత్సలు చేసినట్లు పశువైద్య సహాయ సంచాలకులు నేహ తెలిపారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

మంచాల, సెప్టెంబరు 30: వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేసి రైతులకు మరిన్ని సేవలందిస్తామని డీసీసీబీ అధ్యక్షుడు కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. మంచాల సొసైటీ సమావేశం సోమవారం ప్యాక్స్ చైర్మన్ హన్మంతరెడ్డి అధ్యక్షతన జరిగింది. సత్తయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆధార్ లింక్ వంటి సాంకేతిక సమస్యలతో కొందరు రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. తాజాగా మాఫీకాని రైతుల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేశామన్నారు. కొద్దిరోజుల్లోనే అర్హులందరికీ రూ.2లక్షల వరకు క్రాప్‌లోన్లు మాఫీ అవుతాయన్నారు. సొసైటీలో కొత్త సభ్యులను చేర్చుకునేందుకు తీర్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సత్యనారాయణ, రామచంద్రారెడ్డి, వెంకటేష్, పద్మ, దోడ అరుణమ్మ, సత్యనారాయణ, వేణుగోపాల్‌రావు, పి.రమేష్, సీఈవో శ్రీనివాస్, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీసీబీ అధ్యక్షుడు సత్తయ్య

సొసైటీని లాభాల బాటలో నడిపిస్తున్నాం

యాచారం: సొసైటీని లాభాల బాటలో నడిపిస్తున్నామని యాచారం సొసైటీ చైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి అన్నారు. సొసైటీ నుంచి రుణాలు తీసుకున్న రైతులు తిరిగి చెల్లించాలని కోరారు. సమావేశంలో వైస్‌చైర్మన్ యాదయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సరస్వతి, డీసీసీబీ మేనేజర్ నాగలక్ష్మి, ఏవో రవినాథ్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

రైతులు ఆర్థికంగా ఎదగాలి



వికారాబాద్: సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్

వికారాబాద్, సెప్టెంబరు 30: రైతులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని డీసీసీబీ డైరెక్టర్ ఎన్.కిషన్ నాయక్ తెలిపారు. శివారెడ్డిపేట పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖాళీగా ఉన్న మూడు ఎస్సీ, ఒక ఎస్టీ డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఖాళీగా నాలుగు డైరెక్టర్ పోస్టులను భర్తీ చేసిందన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె.రత్నారెడ్డి, డైరెక్టర్లు జె.వెంకట్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, నర్సిములు, శ్రీనివాస్ రెడ్డి సీఈవో ప్రభులింగం పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి పీఏసీఎస్ అభివృద్ధికి సహకరించాలని చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసొసైటీ ద్వారా 1364 మంది సభ్యులు ఉన్నారని, అప్పు కింద 764 కోట్ల రూపాయలు రుణాలు అందించడం జరిగిందని తెలిపారు. 396 మందికి రుణమాఫీ కాగా 264 మందికి రుణమాఫీ కాలేదని, ప్రభుత్వం వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఈవో శేఖర్, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, డైరెక్టర్లు శ్రీకాంత్‌గౌడ్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



పరిగి సొసైటీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి

పరిగి సొసైటీకి రూ.28కోట్ల టర్నోవర్

పరిగి, సెప్టెంబరు 30: పరిగి సొసైటీ రూ.28 కోట్ల టర్నోవర్‌కు చేరిందని పరిగి మండల పీఏసీఎస్ చైర్మన్ కె.శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. సొసైటీ ఆవరణలో సోమవారం సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఏడాదికి సంబంధించిన నివేదిక సీఈవో బి.అమరేందర్‌రెడ్డి చదివి వినిపించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. సొసైటీలో 1625మంది రైతులు రుణాలు తీసుకున్నారని తెలిపారు. స్వల్పకాలిక రుణాలు రూ.7.88కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.17.02కోట్లు, బంగారంపై 3.48కోట్లు ఇచ్చామని తెలిపారు. రికవరీ తక్కువగా ఉందన్నారు. రుణాలు తీసుకున్నవారంతా తిరిగి గడువులో చెల్లించి సంఘం అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. సొసైటీలో 1053మంది రైతులు రూ.7.38కోట్ల రుణమాఫీకి అర్హులని తెలిపారు. అయితే ఇప్పటి వరకు 464 మంది రైతులకే రూ.2.75కోట్ల మాఫీ అయిందని, వీరందరికి కొత్త రుణాలు కూడా ఇచ్చామని తెలిపారు. ఇంకా 589 మంది రైతులకు రూ.4.63 కోట్లు రుణమాఫీ కావాల్సి ఉందన్నారు. ఈ ఏడాది సొసైటీ రూ.కోటీ 29లక్షల లాభాల్లో ఉందని, రైతులు సహకరిస్తే మరింత ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ శివనోళ్ళ భాస్కర్, సీఈవో బి.అమరేందర్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్లు ఎస్‌పీ బాబయ్య, ఆర్.ఆంజనేయులు, బి.సుభాష్‌చందర్‌రెడ్డి పీఏసీఎస్ సహాయకుడు పాండు,వెంకటయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పూడూరు: పూడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రూ.4 కోట్ల 30 లక్షల రుణ మాఫీ అయినట్లు పీఏసీఎస్ చైర్మన్ పి.సతీశ్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకవర్గం కొత్తలో బంగారు అభరణాలపై రూ.3 కోట్లు రుణాలు ఉండగా, ప్రస్తుతం బంగారు అభరణాలపై రూ.10 కోట్ల రుణాలు రైతులకు అందించినట్లల తెలిపారు. గోదాంలను ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇచ్చేందుకు తీర్మానించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ వైస్ చైర్మెన్ వీరయ్య, సీఈవో ఖలీల్, వెంకటయ్య, శ్రీశైలం గౌడ్, హన్మయ్య గౌడ్, జైపాల్‌రెడ్డి, సిబ్బంది మురళీ, బుచ్చయ్య పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

శామీర్‌పేట: రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు శామీర్‌పేట రైతు సహకార సంఘం చైర్మన్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రామిడి మధుకర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని సహకార సంఘ కార్యాలయంలో సోమవారం43వ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. నష్టాల్లో ఉన్న సంఘాన్ని సభ్యులు సహకారంతో లాభాల బాట పట్టించినట్లు చెప్పారు. జాతీయ రహదారి పక్కన వ్యాపార సముదాయాలు, సంఘం కార్యకలాపాలకు నూతన భవంతిని నిర్మించినట్లు తెలిపారు. రైతుల సౌకర్యార్థం పండ్లు, కూరగాయలను సేకరించేందుకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైస్‌చైర్మన్ ఐలయ్య, సంఘం డైరెక్టర్లు. అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధే లక్ష్యం

బషీరాబాద్, సెప్టెంబరు 30: సొసైటీ అభివృద్ధే లక్ష్యంగా పాలకవర్గం కలిసి కృషి చేస్తోందని నవాంద్గీ పీఏసీఎస్ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో సోమవారం సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో వెంకటయ్య లావాదేవీలను చదివి వినిపించారు. అనంతరం చైర్మన్ మట్లాడుతూ దీర్ఘకాలిక రుణాలు రూ.కోటీ 80లక్షలకు పేరుకుపోయినందున వసూళ్లలో లక్ష్యానికి చేరుకోవాలని అధికార సిబ్బందికి ఆయన సూచించారు. ఈ ఏడాది వానాకాలం సాగుకు గానూ సొసైటీ ద్వారా రూ.కోటీ 20లక్షల పంట రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. గోల్డ్‌లోన్ ద్వారా సొసైటీలో రూ.4కోట్ల రుణం ఇచ్చామన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో రూ.2కోట్ల నాబార్డు నిధులతో గోదాం, రైసుమిల్లు నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని, త్వరలో ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, డైరెక్టర్లు బాస్పల్లి శ్రీనివాస్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, రంగా రెడ్డి, నవీన్‌రెడ్డి, గోపాల్, అనసూయబాయి, అధికార సిబ్బంది పాల్గొన్నారు.


బషీరాబాద్: సమావేశంలో మట్లాడుతున్న చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి

రుణాలను రెన్యూవల్ చేయించాలి

పెద్దేముల్: రైతులు వ్యవసాయానికి పెట్టుబడిగా తీసుకున్న రుణాలను ప్రతీ ఏడాది తప్పక రెన్యూవల్ చేయించాలని రైతుసేవా సహకార సంఘం అధ్యక్షుడు ద్యావరి విష్ణువర్దన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతుసేవా సహకార సంఘంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది రైతులకు రుణమాఫీ కాకపోవడానికి వాటిని రెన్యూవల్ చేసుకోకపోవడం కూడా కారణమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ శీనివాస్‌సాగర్‌రెడ్డి, కోట్‌పల్లి మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ నారాయణరెడ్డి, డైరెక్టర్లు కోహీర్ రవి, బస్వరాజ్, మేనేజర్ మురళీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 10 దరఖాస్తులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

తాండూరు, సెప్టెంబర్ 30: డివిజన్ స్థాయిలో సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 10దరఖాస్తులు వచ్చినట్లు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ తెలిపారు. ఇందులో రెవెన్యూ శాఖ-1, వ్యవసాయ శాఖ-2, విద్యుత్ శాఖ- 2, పశుసంవర్ధక శాఖ-1 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారి మాణిక్‌రావు, ఆర్అండ్‌బీ అధికారి సుజాత పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి చర్యలు


కీసర రూరల్: వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్మికులు

కీసర రూరల్, సెప్టెంబరు 30: కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఈఎస్ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు అందజేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వెంకటేశం పాల్గొన్నారు.

పరిగి: పారిశుధ్య కార్మికులు నిరంతరం వైద్య పరీక్షలు చేయించుకోవాలని మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ సూచించారు. సోమవారం పరిగిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు టి.వెంకటేశ్, బి.నాగేశ్వర్ రావు, నాయకులు రవికుమార్, మీర్‌తాహేర్‌అలీ పాల్గొన్నారు.

కేజీబీవీ ఉపాధ్యాయురాలికి పీహెచ్‌డీ పట్టా


ఉపాధ్యాయురాలు నర్సమ్మ

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 30: మండలంలోని కస్తూర్బాగాంధీ ఆశ్రమ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న బెన్నూర్ నర్సమ్మ ఈ నెల 28న హైదరాబాద్‌లో దళిత సాహిత్యం అనే అంశంపై రీసెర్చ్ చేసి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన నర్సమ్మ చిన్నతనంలోనే తల్లిని కోల్పోగా తండ్రిని 2014లో కోల్పోయింది. అయినా అధైర్యపడకుండా లక్ష్యసాధనకు పట్టుదలతో ముందుకెళ్తూ పీహెచ్‌డీ పట్టా సాధించడంతో గ్రామస్థులు ఆమెను అభినందించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 30: చట్టాలపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు. పౌరహక్కుల దినోత్సవంలో భాగంగా సోమవారం మండలంలోని కొత్తూర్‌లో చట్టాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కులకచర్ల: చాపలగూడెంలో తహసీల్దార్ మురళీధర్ పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అన్వేష్‌రెడ్డి, ఆర్ఐ ఖాజా, అధికారులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండలంలోని కుమ్మరిగూడలో సోమవారం తహసీల్దార్ జయరామ్ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనురాధ, ఎంఈవో గోపాల్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: మండలంలోని ఉద్ధెమర్రిలో సోమవారం తహసీల్దార్ వెంకటనర్సింహరెడ్డి ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగజ్యోతి, ఆర్ఐ సరస్వతి పాల్గొన్నారు.

ఘనంగా పోషణ మాసం వారోత్సవాలు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 30: ఏర్పుమళ్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ మాసం వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, హెచ్ఎం వెంకట్‌రెడ్డి పోషకాహారంతో కలిగే లాభాలను వివరించారు.

బషీరాబాద్: బషీరాబాద్‌సెక్టర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ మాసం వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి హాజరైయ్యారు.

పూడూరు: సోమన్‌గుర్తిలో సోమవారం పోషణమాసం వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

ఉద్యోగుల సేవలు చిరస్థాయిగా నిలుస్తాయి


మోమిన్‌పేట్: ఎం.ఎ.రషీద్‌ను సన్మానిస్తున్న మత్స్యశాఖ అధికారులు

మోమిన్‌పేట్, సెప్టెంబరు 30: ఉద్యోగుల సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని జిల్లా మత్స్యశాఖ అధికారి ఎం.వెంకటయ్య తెలిపారు. మండల కేంద్రంలోని నందివాగు ప్రాజెక్టు సమీపంలో మత్స్యశాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఎం.ఎ.రషీద్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. 36 సంవత్సరాల పాటు మత్స్యశాఖలో సేవలు అందించిన రషీద్ సేవలు మరవలేనివని కొనియాడారు. అనంతరం మత్స్యశాఖ అధికారులు రషీద్‌ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు, డైరెక్టర్లు నరసింహరావు, శ్రీధర్, నర్సిములు, సౌజన్య, మునీందర్, లక్ష్మి, మహేశ్, యాదయ్య పాల్గొన్నారు.

వికారాబాద్: వికారాబాద్ మున్సిపల్ అభివృద్ధిలో భాగంగా టౌన్ ప్లానింగ్ అధికారిగా శరభలింగం అందించిన సేవలు మరువలేనివని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ అన్నారు. చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో టీపీవో శరభలింగం ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ శరభలింగం, ఆయన సతీమణిని పూల మాల, శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జాకిర్ అహ్మద్, కౌన్సిలర్ సురేష్, వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, రమేష్ గౌడ్, వేణుగోపాల్, రాకేష్‌రెడ్డి, ప్రభాకర్, నాయకులు రామ్ నివాస్ రాటి తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: తాండూరు మండల పరిషత్ కార్యాలయానికి 15 సంవత్సరాలుగా నైట్ వాచ్‌మెన్‌గా సి.అనంతయ్య అందించిన సేవలు మరువలేనివని డీసీసీబీ వైస్‌చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్ అన్నారు. తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన అనంతయ్యను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఇటీవల బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి రతన్‌సింగ్‌తో పాటు 9మంది పంచాయతీ కార్యదర్శులకు వీడ్కోలు పలుకుతూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు విశ్వప్రసాద్, సుదర్శన్ రెడ్డి, మండల పంచాయతీ అధికారులు రతన్ సింగ్, ఆనంద్‌రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, డాక్టర్ నరేష్, పంచాయతీ కార్యదర్శులు, లాలప్ప, ఫకోజీ, బాలకృష్ణ, రవి పాల్గొన్నారు.


తాండూరు రూరల్: అనంతయ్యను సన్మానిస్తున్న డీసీసీబీ వైస్ చైర్మన్, ఎంపీడీవో

మూసివేసిన రోడ్లను వెంటనే తెరవాలి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 30: మేడ్చల్ పట్టణంలోని లోటస్ వెంచర్‌లో మూసి వేసిన రోడ్లను వెంటనే తెరవాలని కోరుతూ మేడ్చల్‌కు చెందిన పలు కాలనీ వాసులు సోమవారం మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామ పంచాయతి అనుమతి పొందిన లోటస్ కాలనీ వాసులు గేటెడ్ కమ్యూనిటీ మాదిరిగా కాలనీ చుట్టూ గోడలు ఏర్పాటు చేసి కాలనీకి చెందిన మూడు రోడ్లను పూర్తిగా మూసివేయడంతో చుట్టుపక్కల కాలనీ వాసులు రాకపోకలు కొనసాగించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాఘవేంద్రనగర్, టీచర్స్ కాలనీ, గణేష్ గ్రీన్ పార్క్, విజేత విల్లాస్, వర్ధన సిటీ విల్లాస్, బ్రాడ్వే, ఎస్ఎల్ఆర్ వెంచర్, అపర్ణ వెంచర్, ఇందిరమ్మ కాలనీ, అనన్య కాలనీ, కేఎల్ఆర్, జయదర్శిణి కాలనీలకు చేరుకోవడానికి ప్రస్తుతం జాతీయ రహదారి నుంచి ఒకే దారి ఉందని తెలిపారు. కాలనీ వాసుల ఫిర్యాదుపై విచారణ జరుపుతామని కమిషనర్ తెలిపారు.


మేడ్చల్ టౌన్: కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కాలనీ వాసులు

24న పీడీఎస్‌యూ అర్ధశతాబ్ది ఉత్సవాలు

తాండూరు, సెప్టెంబరు 30: అక్టోబర్ 24న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ అడిటోరియంలో జరిగే పీడీఎస్‌యూ 50వసంతాల (అర్ధశతాబ్ది ఉత్సవ) సభకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం సభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ తాండూరు డివిజన్ అధ్యక్షుడు నవీన్, నాయకులు భాను, ప్రకాష్, అరుణ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు శుభవార్త

తాండూరు, సెప్టెంబరు 30: గ్రామ పంచాయతీ కార్మికులకు దసరా పండుగ వేళ వేతనాలు మంజూరయ్యాయి. గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లింపులకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ వివిధ గ్రామ పంచాయతీలకు సర్క్యూలర్ అందింది. ఎంపీడబ్ల్యూఎస్ కార్మికులకు జీతాలు, సీసీ చార్జీలు, ట్రాక్టర్ కిస్తీలు, పచ్చదనం-స్వచ్ఛదనం కార్యక్రమాల చెల్లింపులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

మిరాలం కుంటను కాపాడాలి

ఘట్‌కేసర్, సెప్టెంబరు30: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో గల మిరాలం కుంటకు ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటుచేసి కుంట ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని 11వ కౌన్సిలర్ నల్లవెల్లి లక్ష్మి సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అన్నోజిగూడలోని సర్వేనెంబర్లు 87, 88, 89, 90, 92, 66లలో విస్తరించి ఉన్న మిరాలంకుంట రోజురోజు ఆక్రమణకు గురౌతున్నదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సంక్షిప్తంగా..

● **దౌల్తాబాద్:** దౌల్తాబాద్ మండలంలోని చంద్రకల్‌లో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా 10సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై రవిగౌడ్ సోఓమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శివకుమార్, నరేశ్, మాజీ సర్పంచ్ నర్సిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నాగరాజు పాల్గొన్నారు.

● **కీసర:** మహత్ముడిని స్మరించేందుకు మాజీ ఎంపీటీసీ బెలిదె రమేష్ గుప్తా గాంధీ విగ్రహ ఏర్పాటుకు రూ.75వేలు విరాళంగా అందజేశారు. కీసర కేంద్రంలో కొంత కాలం కిందట మహత్మగాంధీ విగ్రహాన్ని తొలగించారు. తిరిగి విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో గత పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. విగ్రహ ఏర్పాటుకు విరాళం అందజేసిన రమేష్ గుప్తాను స్థానికులు అభినందించారు.

● **కొడంగల్:** ఓయంఐఎఫ్ ఆపరేషన్ విర్సి ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొడంగల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలకు స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎంపీడీవో ఉషశ్రీ సోమవారం ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీయం వెంకన్న, సంస్థ కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్, జిల్లా కో ఆర్డినేటర్ నారాయణ, ఇస్వప్ప పాల్గొన్నారు.

● **పూడూరు:** స్థానిక మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడంతో సోమవారం నూతన ప్రిన్సిపాల్ సరళ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేందర్, రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **బషీరాబాద్:** మండలంలోని కాశీంపూర్, నవాంద్గీ, క్యాద్గీరా, కొర్విచెడ్ గ్రామాల పరిధిలోని వ్యవసాయ పంట పొలాలను తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త యమునా సోమవారం సందర్శించారు. ఆమె వెంట డివిజన్ వ్యవసాయాధికారి రుద్రమూర్తి ఏఈవో నవీన్ ఉన్నారు.

● **నవాబుపేట:** మండల నూతన ఎంఈవోగా అబ్దుల్ రహెమాన్ బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని చిట్టిగిద్ద జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ రహెమాన్ సోమవారం మండల నూతన ఎంఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఆయనను ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

● **మోమిన్‌పేట్:** న్యాస్ పరీక్ష ఫలితాల్లో జిల్లా స్థాయిలో విద్యార్థులు ప్రతిభ చాటాలని రాష్ట్ర పరిశీలకుడు ఎండీ.యాసిన్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా బాలుర, బాలికల పాఠశాలల్లో న్యాస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) నమూనా పరీక్షను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులకు న్యాస్ పరీక్షల సన్నదతకు సంబంధించిన ప్రణాళికను వివరించారు. ఉపాధ్యాయులు డిజిటల్ విధానంలో విద్యార్థులకు బోధన చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మల్లేశం, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పద్మారావు ఉన్నారు.

● **మర్పల్లి:** వారం రోజుల కిందట మండల కేంద్రానికి చెందిన నర్సింహులు అనారోగ్యంతో మృతిచెందగా తోటి స్నేహితులు బాధిత కుటుంబానికి సోమవారం రూ.20వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

● **కీసర:** ఈనెల 3వ తేదీ నుంచి కీసర గుట్టలో దేవీశరన్నవరాత్రులు ప్రారంభం కానున్నట్లు ఆలయ చైర్మన్ తటాకం నాగ లింగం శర్మ, ఈవో సుధాకర్‌లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 12వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

దౌల్తాబాద్/బొంరాస్‌పేట్/మేడ్చల్ టౌన్/మూడుచింతలపల్లి: సెప్టెంబరు 30: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతిచెందారు ఈ ఘటనలు దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, మేడ్చల్, శామీర్‌పేట పరిధిలో చోటుచేసుకున్నాయి. బంధువుల అంత్యక్రియలకు వెళ్తుండగా ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి చెందగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన దౌల్తాబాద్ మండల పరిధిలో జరిగింది. ఎస్ఐ రవి గౌడ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఈర్లపల్లికి చెందిన మాల లాలప్ప సోమవారం నాగసారంలో బంధువుల అంత్యక్రియలకు ట్రాక్టర్‌లో అమృతమ్మ, మాల కిష్టప్ప, మాల నర్సప్ప, అచ్చప్ప, కవిత, దస్తమ్మ, భీమమ్మ, మాలబసప్ప, మాలనర్సమ్మ, మల్కప్ప, భీమప్ప, వెంకటమ్మ, లక్ష్మమ్మలతో కలిసి బయల్దేరారు. డ్రైవర్ లాలప్ప అతివేగంగా నడపడంతో అదుపుతప్పి దేవరఫస్లాబాద్ గ్రామ శివారులో రోడ్డు పక్కనే ఉన్న కందిచేనులోకి ట్రాక్టర్ దూసుకెళ్లి బోల్తాపడింది. అమృతమ్మకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మిగతావారికి తీవ్ర గాయాలయ్యాయి. మృతురాలి భర్త మాల లాలప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, ప్రమాదం జరిగినప్పుడు స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందిస్తే గంట వరకు రాకపోవడంతో ప్రైవేట్ వాహనంలో క్షతగాత్రులను కొడంగల్, మద్దూర్ ప్రభుత్వాసుపత్రులకు తరలించినట్లు బంధువులు తెలిపారు. మరో ప్రమాదం బొంరాస్‌పేట్‌లో చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి కర్ణాటకలోని మల్కెడ్‌కు కారులో డ్రైవర్ రవికుమార్‌తో పాటు రవిచంద్రన్, విశ్వనాథ్ వెంకటరమణయ్య బయల్దేరారు. ఈ క్రమంలో బొంరాస్‌పేట్ పెద్ద చెరువు దగ్గరికి రాగానే కారు టైరు పేలింది. దీంతో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న విశ్వనాథ్ వెంకటరమణయ్య(49)కు తీవ్రగాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. డ్రైవర్ రవికుమార్, రవి చంద్రన్‌కు గాయాలయ్యాయి. విశ్వనాథ్ వెంకటరమణయ్య మృతదేహాన్ని, గాయాలైన ఇద్దరిని కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు విశ్వనాథ్ భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు. అదేవిధంగా మేడ్చల్ చెక్‌పోస్టు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. లింగంపల్లి నివాసి వెంకట్ రెడ్డి(55) తన కుమారుడు రఘువర్ధన్‌రెడ్డి(22), మరో యువకుడితో కలిసి బైక్‌పై సోమవారం రాత్రి మేడ్చల్ వైపు వస్తున్నారు. ఈ క్రమంలో చెక్‌పోస్టు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఆగి ఉన్న ఓ కారు డోర్లను అకస్మాత్తుగా తీయటంతో బైక్ కారు డోరుకు తగిలి ముగ్గురూ కిందపడ్డారు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ వెంకట్‌రెడ్డి తలపైనుంచి వెల్లడంతో ఆతను అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. మరో ఘటనలో బైకుపై వెళ్తున్న ఇద్దరు యువకులు డివైడర్‌ను ఢీకొనటంతో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. జగద్గిరి గుట్టకు చెందిన శ్రీకాంత్(29), మున్నూరు నరేష్‌లు సోమవారం ఉదయం బైక్‌పై కామారెడ్డి వెళ్తుండగా మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అత్వెల్లి మసీదు వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతిచెందగా నరేష్‌కు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. అదేవిధంగా శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందగా ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. భూపాలపల్లి జిల్లా బొమ్మాపూర్ గ్రామానికి చెందిన పుష్పలత, ఆమె కొడుకు మనోహర్‌రెడ్డి, కూతురు రష్మిత, మనవరాలు రియాన్షిలతో కారులో హైదరాబాద్‌లోని నిజాంపేట్‌కు బయల్దేరారు. శామీర్‌పేట్ ఆర్ఆర్‌పై భారీ వర్షం కారణంగా ప్రమాదవశాత్తు ఓఆర్ఆర్ ఎగ్జిట్ 100మీటర్ల దురంలో డివైడర్‌ను ఢీకొట్టడంతో కారు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పుష్పలత తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మిగతా ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాగ్నానదిలో వ్యక్తి మృతదేహం లభ్యం

బషీరాబాద్, సెప్టెంబరు 30: కాగ్నానదిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. జీవన్గి గ్రామానికి చెందిన మొగులప్ప(33) కూలీ పని చేస్తుండేవాడు. ఇటీవల మద్యానికి బానిసై కొంత కాలంగా ఇంటిపట్టున ఉండటంలేదు. మూడు రోజుల కిందట ఇంట్లోంచి వెళ్లిన అతడు సోమవారం ఉదయం సమీప కాగ్నానదిలో శవమై తేలాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి విచారణ చేపట్టగా మృతుడు మొగులప్పగా స్థానికులు గుర్తించారు. ఈ మేరకు మృతుడి భార్యతో పాటు ఆరు సంవత్సరాల కూతురు ఉంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎంఏ గఫార్ తెలిపారు.

కళాశాలలో బతుకమ్మ సంబురాలు


బతుకమ్మ సంబరాల్లో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కొడంగల్, సెప్టెంబరు 30: తెలుగు సాహిత్య పరిషత్, ఉమెన్స్ ఎంపవర్మెంట్ ఆధ్వర్యం లో కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం తెలంగాణ సంస్కృతిక సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. అధ్యాపకులు, విద్యార్థులు రంగు, రంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి ఆటాపాటల్లో పాల్గొన్నారు. అనంతరం బతుకమ్మలను కొడంగల్ పట్టణ శివారులోని కుంటలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఫియాఖానమ్, వైస్‌ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేవీ రాడార్ స్టేషన్ వద్దు


నిరసన తెలుపుతున్న టీపీటీఎల్ఎఫ్ నాయకుడు విజయ్‌కుమార్, గ్రామస్థులు

పూడూరు, సెప్టెంబరు 30: తెలంగాణకు ప్రాణవాయువు అందిస్తున్న పూడూరు మండలంలోని దామగుండం అటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేసే నేవీ రాడార్ స్టేషన్ అవసరం లేదని రచయిత, టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ విజయ్‌కుమార్ అన్నారు. పూడూరు మండల ప్రజలతో కలిసి మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర నిరసన తెలిపారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని, లేని పక్షంలో వికారాబాద్ జిల్లా ప్రజల ఉగ్రరూపాన్ని చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మాజీ నాయకుడు కె.విజయ్, గ్రామస్థులు నర్సిములు, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిపై పట్టింపేది?

బషీరాబాద్, సెప్టెంబరు 30: ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా పలు శాఖల అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. బషీరాబాద్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి మండల స్థాయి వివిధ శాఖల అధికారులు రావాల్సి ఉండగా ఎంపీడీవో విజయ్‌కుమార్, తహసీల్దార్ వై.వెంకటేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, ఐకేపీ, ఈజీఎస్ అధికార సిబ్బంది మాత్రమే కనిపించారు. మిగతా విద్యుత్, వ్యవసాయశాఖ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, అటవీశాఖ, వైద్య, సోషల్‌వెల్ఫేర్ తదితర శాఖల అధికారులెవరూ ప్రజావాణిలో కనిసపించలేదు. ఈ విషయమై ఎంపీడీవో విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా హాజరుకాని అధికారులపై కలెక్టర్‌కు నివేదించి మెమోలు జారీ చేస్తామని వెల్లడించారు.

ఘట్‌కేసర్ బస్టాండ్ నిర్వహణకు సామగ్రి వితరణ


బస్టాండ్ ఉద్యోగులకు చెత్త డబ్బాలు, సామగ్రి అందజేస్తున్న హెచ్‌పీసీఎల్ ఉద్యోగులు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 30: స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా అంకుషాపూర్‌లోని హెచ్‌పీసీఎల్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఘట్‌కేసర్ బస్‌స్టేషన్‌తోపాటు పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం బస్టాండ్‌లోని ఆర్టీసీ అధికారులకు చెత్తడబ్బాలతోపాటు వివిధ రకాల వస్తువులను అందజేశారు.

మోమిన్‌పేట్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో విజయలక్ష్మీ విద్యార్థులకు పాఠాలు బోధించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో మల్లేశంతో కలిసి స్వచ్ఛతా హీ సేవా అనే అంశంపై సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో యాదగిరి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, గౌరీ శంకర్, ఉపాధ్యాయులు సమ్మయ్య, రమేశ్, పద్మారావు, విద్యార్థులు పాల్గొన్నారు.